# క్లైమాక్స్ లేని కథ

పొద్దున్నే ఆఫీసులో కూచొని ఏదో రాసుకుంటున్నాను. విశ్వనాథం వచ్చేడు. వచ్చీ రాంగానే "ఏమిటోయ్ యీ మధ్య బోయ్ మీట్స్ గరల్ కథలు రాస్తున్నావ్ ?" అన్నాడు. నిజం చెప్పొద్దూ. విశ్వం అన్న మాట నాకు తిట్టులా తగిలింది.

"ఎక్కడ చూచావ్ ?" అన్నాను

"ఆ మధ్య వార పత్రికలో నీ రెండు కథలు:- "తిరుగుబాటు", "పెళ్ళి" అనుకుంటాను. చదివాను. రెండు కథల్లోనూ అబ్బాయి, అమ్మాయి ప్రేమించి, పెళ్ళి చేసుకుంటారు. ప్రేమ: పెళ్ళి యివి అంత సులభంగా జరుగుతాయా ?" అన్నాడు.

వాస్తవానికి ఆ రెండు కథల్లోనూ, నేను చెప్పదలచుకున్న అంశం అబ్బాయి, అమ్మాయి ప్రేమించి కలుసుకోవడం కాదు అయితే విశ్వానికి ఆ కథలు అలా అనిపించాయి. బహుశా నేను చెప్పదలుచుకున్న అంశాన్ని సూటిగా చెప్పలేకపొయ్యానేమో !

"పోనీ ఇక మీదట అలాటి కథలు రాయనులే" అన్నాను నవ్వుతూ. విశ్వం కొంచెంసేపు ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు, "ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?" అన్నాను.

"ఏం లేదు ఒక అనుభవం చెపుతాను. వింటారా ?" అన్నాడు.

నేను రెండు కాఫీలు తెప్పించేను. విశ్వం కాఫీ తాగి సిగరెట్టు వెలిగించాడు.

"ఇక చెప్పు వింటాను" అన్నాను.

విశ్వం మొదలెట్టాడు.

* * *

"బియ్యే పాసయినాక రెండేళ్ళు వుద్యోగం దొరకలేదు. మొగుడు దొరక్కపోతే అక్క మొగుడే గతి అని ఏదో సామెత చెబుతారు అలాగే, ఏ ఉద్యోగం దొరకలేదు గనక బి. ఇడి ట్రయినింగ్‌కు వెళ్ళాను. ఆ ట్రయినింగ్ సీటయినా ఆంధ్రదేశంలో దొరకలేదు. ఐదొందలు డొనేషను ముట్టచెప్పాక బళ్ళారిలో దొరికింది. అంతా వందమందిదాకా వుండే వాళ్ళం.

వెళ్ళిన పదిహేను రోజుల కనుకుంటాను-టీచింగ్ ప్రాక్టీసు మొదలయింది. మమ్మల్ని పది బాచీలుచేసి, ఒక బాచికి ఒకో స్కూలు కేటాయించారు.

మా బాచిలో తొమ్మిది మంది మగవాళ్ళం, ఒక అమ్మాయి. ఆ అమ్మాయి కాన్వెంటు నుండి వచ్చేది. మామూలు అమ్మాయికాదు. నన్ (క్రైస్తవ సన్యాసిని) టీచింగ్ ప్రాక్టీసు మొదలుకాకముందు ఆ అమ్మాయిని క్లాసులో చూచినట్లు జ్ఞాపకంలేదు. మా బాచిలో మొదటి లెసన్ ఇవ్వడం ఆ అమ్మాయితోనే ప్రారంభమయింది.

పాఠం చెప్పడానికివెళ్ళి ఆ అమ్మాయి నల్లబల్ల దగ్గర నిలబడింది. నేను క్రిటిసిజం నోట్సుతీసి, పాఠం చెబుతున్నవారి పేరు రాసుకోవాలి గనక, పక్కనవున్న మిత్రుణ్ణి అడిగేను, ఆమె పేరేమిటని.

"సిస్టర్ రెజీనా" అన్నాడు అతను. చెప్పబోయే విషయానికి పిల్లలు మనసుని సిద్ధం చేసేందుకు ఆమె ఇంట్రడక్షన్ చెబుతోంది. ఆమె నోటినుంచి వస్తున్నవి మామూలు మాటలు కాదు. ఆ మాటల వెనక ఏదో సంగీతం వుంది. పిల్లలు మంత్ర ముగ్ధుల్లా వింటున్నారు. మా బాచిలోని మిగతావాళ్ళు ఏం చేస్తున్నారో తెలీదుకాని, నేను మట్టుకు ఆమెవైపు అలాగే చూస్తూ, కూచున్నాను ఆమెలోని వంపులూ, సొంపులూ, ఏవీ కనిపించకుండా పైనుంచి కిందిదాకా తెల్లటిగౌను వుంది. నెత్తిమీద కూడా శిరస్త్రాణంలాటి ముసుగు వుంది. ముఖంఒక్కటే కనిపిస్తున్నది అందాన్ని ఎంతదాచిపెట్టడానికి ప్రయత్నించినా దాగడం లేదు. ప్రపంచ సుందరికి పోటీచేసే వాళ్ళని ఇంతకన్నా అందంగా వూహించడం నాకుచేత కాలేదు.

"అలాచూస్తూ కూచుంటే లాభంలేదు, క్రిటిసిజం రాయాలి"

ఉలిక్కిపడి చూచేను వెనుక డెస్కుమీద కూర్చున్న లెక్చరరు హెచ్చరిస్తున్నాడు. పట్టుబడ దొంగలా ఫీలయ్యాను. పాఠంమీదికి దృష్టి పోనిచ్చి, పాయింట్సు నోట్‌చేసుకుంటూ కూచున్నాను.

లెసను అయిపోయింది. పీరియడ్ ఐదునిముషాలున్నట్టుంది తప్ప, 45 నిముషాలు వున్నట్టులేదు.

ఆ పూటకి సిస్టర్ రెజీనా ఒక్కర్తిదేక్లాసు. బయటికివచ్చి గ్రౌండులో చెట్టుకింద కూచున్నాం.అందరూ తాము రాసిన క్రిటిసిజం చదివేరు

"మీరేం రాశారో చదవండి" అన్నాడు లెక్చరర్ నన్ను ఉద్దేశించి.

ఆ అమ్మాయి నా ముఖంలోకి చూస్తోంది నిజం చెప్పాలి, నెరసులు వెదకడంలో కొంచెం నేర్పు వున్నవాణ్ణి, ఇతర్ల కళ్ళ బడనివి. నా కళ్ళలోనే పడ్డాయి. అన్నీ చదివేను. ఆ అమ్మాయి ముఖంచూస్తే కొంచెం బాధపడ్డట్టే వుంది.

క్రిటిసిజం అయ్యాక ఎవరి దోవన వాళ్ళు వెళ్తున్నారు. నేను సిస్టర్ రెజీనా దగ్గరికి వెళ్ళి "బాధ కలిగించివుంటే క్షమించాలి" అన్నాను.

ఆ అమ్మాయి నిండుగా నవ్వింది.

"మీరు భలేవారే, ఏముందని బాధపడటానికి. మనం నేర్చుకునే దానికే వచ్చాం, తప్పులు తెలుసుకోకపోతే ఎట్లా" అంది.

ఆపైన ఎవరమూ ఏం మాట్లాడలేదు.

మరుసటిరోజు నేను క్లాసు తీసుకోవాలి. సిసరు రెజీనాను దృష్టిలో పెట్టుకొని బాగానే ప్రిపేరు అయ్యాను. కాని క్లాసు తీసుకోవడం మట్టుకు జరగలేదు. స్కూలు దగ్గరికి వెళ్ళగానే, లెక్చరరుకూ, నాకూ చిన్న పేచీ వచ్చింది. నేను టక్ చేసుకొని వచ్చాను కోటు వేసుకోందే పాఠం చెప్ప కూడదన్నాడు లెక్చరర్.

"ఇది మరీ బాగుంది. లేని కోటు ఎక్కణ్ణుంచి తేను" అన్నాను

"కుట్టించుకోవాలి" అన్నాడు ఆయన.

"డబ్బుల్లేవు"

"అయితే శుభ్రంగా పంచె కట్టుకొని కండువా వేసుకరండి" అన్నాడు.

"పంచె కట్టడం నాకు చేతకాదు. పంచె కట్టుకున్నా ముసలివాళ్ళ లాగా కండువా వేసుకోలేను" అన్నాను.

మాటామాటా పెరిగింది. ఏమైతేనేం నేను పాఠం చెప్పడం జరగ లేదు. లెక్చరరు చిలవలూ పలువలూ కల్పించి ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేశాడు. ప్రిన్సిపాలుతో మళ్ళీ అదే రగడ.

"మీ ఆంధ్రులకి ఇక్కడ సీటు ఇవ్వడమే పొరపాటు డిసిప్లిన్ పాడుచేస్తున్నారు" అన్నాడు.

"ఉత్తపుణ్యానికి ఇవ్వలేదుగదండీ, ఐదొందలు డొనేషన్ పుచ్చు కున్నారు" అన్నాను.

నా వాలకం చూసి ఆయన భయపడ్డట్లే వుంది.

"సరే ఎలాగన్నా తగలడండి" అన్నాడు చేసేదిలేక.

ఈ గొడవంతా క్లాసులోనే జరిగింది. క్లాసు బయటికి వచ్చినాక రెజీనా నా దగ్గరకొచ్చింది.

"మీరు ప్రమాదంకోరి నెత్తికి తెచ్చుకొనే మనుషుల్లా వున్నారే" అన్నది నవ్వుతూ.

"దీనివల్ల ఏం ప్రమాదముందని" అన్నాను. "ప్రాక్టికల్స్‌కు వాళ్ళ చేతుల్లో మార్కులు వుంటాయి. ముందుగానే మన తెలుగువాళ్ళంటే మంట. తోక కొయ్యరా ?" అంది.

"నన్ను కుక్క కిందనో నక్కకిందనో జమకడుతున్నారు మీరు" అన్నాను.

ఆమె నవ్వింది. "అదికాదండీ మనం యిక్కడే తిష్ట వెయ్యడం లేదు వుండేది తొమ్మిది నెల్లు. వున్న రెండ్రోజులూ మంచి అనిపించు కుంటే బాగుండదా ?" అన్నది.

"మంచికీనాకూ పడదులెండి" అన్నాను. రెజీనా నవ్వింది. వెన్నెల లాంటి నవ్వు. ఆమెతో అలా ఎంతసేపయినా మాట్లాడుతూ వుండాలని పించింది కాని ఆమె వెళ్ళిపోయింది.

మరుసటి రోజు నేను లెసను చేశాను. క్రిటిసిజం అయిపోయాక రెజీనా నాదగ్గరికి వచ్చి "బాగా అనుభవం వున్నవారిలాగా లెసన్ యిచ్చారండీ" అన్నది.

"రండి. అలా వెళ్ళి కాఫీ త్రాగుదాం" అన్నాను కొంచెం తటపటా యించి "మేం రాకూడదండీ-సుపీరియర్ మదర్‌కి తెలిస్తే కోపగిస్తుంది" అంది.

"ఎక్స్‌క్యూజిమీ నాకు మీ నియమాలు తెలియవు" అన్నాను.

రెజీనా మళ్ళీ ఏమనుకుందో "పదండి వెడదాం" అంది.

వెళ్ళి కాఫీ తాగుతూ ఆ మాటా, ఈ మాటా మాట్లాడుకున్నాం. మా ఇద్దరిమధ్య పరిచయం బాగానే అభివృద్ధి చెందింది. మేము పరిచయం దాటి ఒక్క అడుగు ముందుకు వేసిన ఘట్టం వేరే వుంది.

ఒకరోజు మధ్యాహ్నం రెండింటికి టీచింగ్ ప్రాక్టీసుకని స్కూలుకు వెళ్ళాం. తీరా వెళ్ళిన తర్వాత తెలిసింది - స్కూల్లో ఏదో ఫంక్షన్ వుండటం మూలంగా క్లాసులు లేవని.

క్లాసులు లేవంటున్నారు. కాన్వెంటుకువెళ్ళి ఏంచేస్తారు" అన్నాను. చేసేదేముంది, చదువుకుంటాను" అంది రోజూవున్న చదువేగా, రండి అలా వెళ్ళి కాసేపు పార్కులో కూచుందాం అన్నాను.

రావచ్చుననుకోండి క్లాసులులేవని సుపీరియర్ మదర్‌కి తెలిస్తే ఇంత ఆలస్యం ఎందుకయిందని సంజాయిషీ అడుగుతుంది" అన్నది దీనంగా.

ఎక్కడి కొలు బజారు ఎక్కడి గాంధీనగర్. సుపీరియర్ మదరికి టెలిపతి లాటిదేదన్నావుంటేతప్ప తెలియదులెండి" అన్నాను.

"టెలిపతిని మీరు నమ్ముతారా?" అంది.

"ఏం" అన్నాను.

'సరిగ్గా ఒక్క నిముషంముందు, మీరు కాఫీహోటల్‌కో పార్కుకో పిలుస్తారని నేను వూహించాను. నేను వూహించిన సమయంలో మీరు నన్ను పార్కుకు పిలవాలని అనుకుంటూవుంటారు. చిత్రంగా లేదా ?" అన్నది.

"యాదృచ్ఛికంగా మన వూహలు కొన్ని జరుగుతాయిలెండి" అన్నాను.

పార్కుకు మేం వెళ్ళేసరికి ఎవ్వరూలేరు.

"సిస్టర్ రెజీనా. మీకు సుపీరియర్ మదర్ అంటే సింహస్వప్నం లాగుందే ! అన్నాను.

"దేవాంతకురాలండీ. అన్నీ ఆరాలు తీస్తుంది" అన్నది.

"పెద్ద దిక్కన్న తర్వాత, ఆ మాత్రం వుండటం మంచిదిలెండి" అన్నాను.

"పెద్ద దిక్కన్న తర్వాత పెద్ద బుద్ధికూడా వుండాలి" అన్నది.

"లేదా?" అన్నాను.

"పాలపొడి, గోధుమలు అమ్మి వేలకు వేలు వెనకేస్తోంది. పసి బిడ్డల కడుపుకొట్టే మనిషిది ఏం పెద్ద బుద్ధండి" అన్నది.

"డబ్బు ఆవిడేం చేస్తుంది సంసారమా ? బిడ్డలా ?" అన్నాను ఆశ్చర్యంగా.

"సొంత సంసారమూ, సొంత బిడ్డలే వుండాలా? అక్క బిడ్డలూ, చెల్లెలి బిడ్డలూ బిడ్డలుకారా? ఈవిడ చెల్లెలి కొడుకు లిద్దరూ మెడికోస్. ఈమె చదివిస్తున్నదంటారు" అన్నది.

"మీకు ఈ సంసార లంపటాలేవీ వుండవనుకున్నానే" అన్నాను.

"ఎందుకుంటాయ్? ఆకాశంనుంచి వూడిపడ్డ వాళ్ళం కదా!"అన్నది నవ్వుతూ. ఆకాశం నుంచి వూడిపడ్డవాళ్ళని నేను అనుకోలేదు కాని,

కొంచెం ఎక్కువే వూహించుకున్నాను. నా వూహ తప్పయినందుకు సంతోషించాను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు" అన్నది.

"ఏంలేదు. మీ కాన్వెంటు విషయాలు చెప్పండి వింటాను" అన్నాను.

"నాలుగు గోడలమధ్య జీవితం. నేను చెప్పడానికీ. మీరు వినడానికీ ఏం ఇంట్రెస్టుగా వుంటుంది. మీరేమైనా చెప్పండి" అన్నది. నేనేం మాట్లాడటానికి నా మనసు మాటలమీద లేదు. ధ్యాసంతా రెజీనామీదే వుంది. ఏదో యాంత్రికంగా మాటాడుతున్నాను. కాసేపున్న తర్వాత.

"వెళ్దాం పదండి" అంటూ లేచింది. ట్రయల్ అండ్ ఎర్రర్ మెథడ్ జ్ఞాపకానికి వచ్చింది.

"వెళ్లొచ్చు కూచోండి" అంటూ చెయ్యిపట్టుకొని లాగాను.

నా ట్రయల్ బెడిసికొట్టలేదు. నవ్వుతూ కూచుంది. మరొక్క అడుగు ముందుకు వెయ్యడానికి పెద్ద సాహసం అక్కర్లేకపోయింది. దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకొన్నాను.

"ఛీ ఏం పనిచేశారండీ" అన్నది.

అక్కడికి తనపాత్ర ఏమీలేనట్టు.

నేను మళ్ళీ దగ్గరికి తీసుకోబోయాను. ఆమె దొరక్కుండా, లేచి దూరంగా వెళ్ళి నిలబడింది.

"మీరు ప్రమాదమైన మనుషుల్లా గున్నారు నేను వెళ్తున్నాను" అంటూ వెనుక ఎవరో తరుముతున్నట్టు వెళ్ళిపోయింది, వెళ్ళేముందు గేటు దగ్గర నిలిచి నవ్వింది,

పార్కు నందన వనంలా కనిపించింది ఆ క్షణం,

ఈ సంఘటన తర్వాత నాకు మెస్సులో వుండ బుద్ధి అవలేదు కాన్వెంటు దగ్గరగా ఒక రూం తీసి అందులో చేరేను.

మరుసటి రోజు రెజీనా కాలేజీకి వస్తుండగా ఆమెను కలుసుకొని రూం చూపిస్తూ "ఇక్కడికి మారానండీ" అన్నాను.

"అక్కడే వుండక పోయారా? కాలేజీకి దగ్గరగా వుండేది" అన్నది.

రివర్స్ గేర్!

రెజీనా మీద చెడ్డకోపం వచ్చింది. కాలేజీకి వెళ్ళాను గాని, క్లాసులో వుండబుద్ధి కాలేదు. అటెండెన్సు యిచ్చి, రూం కొచ్చి పడుకున్నాను.

సాయంత్రం రెజీనా నా గది వాకిలిముందు తచ్చాడుతోంది. నాకు ప్రాణం లేచివచ్చింది.

"లోపలికి రండి" అన్నాను.

ఆమె అటూ, ఇటూ చూచి లోపలికి వచ్చింది.

"ఏమైంది సార్ క్లాసుకు ఎగ్గొట్టారు" అంది రాగానే. ఆమెప్రశ్నలకు జవాబుచెపుతూ కూర్చునే ఓపిక నాకులేదు, వెళ్ళి తలుపుమూసేను.

"ఛీఛీ యిదేం పాడుబుద్ధి రూంకొస్తే తలుపులువేస్తావు. నేను వెళ్ళాలి వుండండి" అంటూ తలుపుదగ్గరికి వచ్చింది.

"వెళ్తావా?" అన్నాను దీనంగా.

"వెళ్ళను తలుపుతీయండి" అంది. నేను తలుపులు తీశాను. ఆమె నిజంగానే వెళ్ళలేదు. వచ్చి కూర్చుంది ఇంత రసాభసా జరిగినాక నాకు ఏం మాట్లాడటానికి తోచలేదు.

"మీకు కోపం వచ్చినట్టుంది" అన్నది.

నేను అవును అనలేదు కాదు అనలేదు. ఇద్దరం అలాగే నిశ్శబ్దంగా కూచున్నాం.

"మీకేం మగవాళ్ళు. ఏం చేసినా చెల్లుతుంది. నా పరిస్థితి మీరు అర్థం చేసుకోరేం" అంది నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ.

నిజమే, నా స్వార్థం నాది తప్ప ఆమెను గురించి ఆలోచించలేదు. కాకూడనిది ఏదన్నా అయితే, ఆమె గతి ఏం కాను?

"పొరపాటయిందండీ" అన్నాను.

"ఫరవాలేదు. మీరు కొంచెం హద్దులో వుండాలి" అన్నది.

మొదటి సారిగా ఆమె మీద నాకు జాలి కలిగింది. ఆమె స్థితికి బాధ కలిగింది. మీరు కొంచెం హద్దులో వుండాలి అని ఏ ఉద్దేశ్యంతో అన్నదో అర్థం అయింది. ఆమెను దగ్గరికి తీసుకున్నాను. అభ్యంతరం చెప్పలేదు.

"రెజీనా! నీకు పెళ్ళీ సంసారమూ బిడ్డలు, ఇవంటే విరక్తా" అన్నాను.

"అలాటిదేం లేదు" అంది.

"మరి ఎందుకు పెళ్ళిచేసుకోలేక పోయ్యావ్? నన్గా ఎందుకొచ్చావ్?" అన్నాను.

"మంచి ప్రశ్నే. మెడిసిన్ చదవడం అంటే మీకు అయిష్టం కాదనుకుంటాను. టీచరు ట్రైనింగ్‌కు ఎందుకు వచ్చారు?"

దానికీ దీనికీ సామ్యం ఏమిటీ? మెడిసిన్‌లో సీటు దొరకదని బియ్యేలో చేరాను. నువ్వు కావాలనుకొనివుంటే పెళ్ళిచేసుకొని వుండవచ్చునే" అన్నాను.

"మీరు పెళ్ళిని గురించి చాలా తేలిగ్గా మాట్లాడుతున్నారు"

"పెళ్ళి కాకుండా ఏ ఆడదన్నా నిలచిపోయినట్టు నే నెరుగను" అన్నాను.

"నన్ను చూచినాకైనా మీ అభిప్రాయం మార్చుకోండి" అన్నది.

"నిజమా: నమ్మలేకుండా వున్నాను. ఇంత అందంగా వున్న మిమ్మల్ని పెళ్ళి చేసుకోడానికి ఎవరూ రాలేదా?" అన్నాను.

"పెళ్ళికి అందమొక్కటే సరిపోతుందా ? కట్నమక్కరలేదా ?" అంది.

"అక్కరలేదనను. కానీ, మీ విషయంలో కట్నం కొంచెం తక్కువయినా, ఎవరయినా చేసికొని వుండవచ్చు" అన్నాను.

"ఆ తక్కువ కట్నమయినా వుండాలికదా, అమ్మా నాన్నా వ్యవసాయ కూలీలు, నేనూ అలాగే అయివున్నా జీవితం బాగుండేదనుకుంటాను. కాథలిక్కు ఫాదర్ ఒకాయన నన్ను కాన్వెంటులో చేర్పించి స్కూలు ఫైనలు వరకు చదివించేడు.

స్కూలు ఫైనలు చదువుకున్న నాకు పెళ్ళి చెయ్యడం అమ్మా నాన్నకు సాధ్యంకాలేదు."

"ఒక్క సంబంధం అంటే ఒక్క సంబంధమన్నా రాలేదా ?"

"స్కూలు ఫైనలు అయిన తర్వాత నాలుగేళ్ళు యింటిదగ్గర వున్నాను. మూడు సంబంధాలు వచ్చేయి. ఒకటి రిటయిర్ కాబోయే హెడ్ క్లార్కు సంబంధం.

ఇంకో సంబంధం, అబ్బాయి వయసులో వున్నవాడే కానీ తాగుబోతు. లారీడ్రైవరు, మరొకడు తాలూకా ఆఫీసు "ప్యూను".

"ఏదన్నా ఉద్యోగంలో చేరకపోయారా ? తీరిగ్గా సంబంధాలు వెతుక్కొని వుండవచ్చు" అన్నాను.

'స్కూలు ఫైనలుకు ఎవరిస్తారు ఉద్యోగం. అమ్మకూ నాన్నకూ అప్పటికే బరువయ్యాను. రెక్కాడితేగాని డొక్కాడనివాళ్ళు కూర్చోపెట్టి ఎన్నాళ్ళు పోషిస్తారునన్ను ? విసుగుపుట్టి ఇందులో ప్రవేశించేను. ప్రయివేటుగా బియ్యే ఇక్కడికొచ్చిన తర్వాతనే చదివేను" అంది.

ఆమె తన కథను రెండు ముక్కల్లో మామూలుగానే చెప్పింది. కాని నా మట్టుకు ఆమె కథ వింటూంటే గుండె పట్టి ఎవరో లాగుతున్నట్లనిపించింది.

"వెళ్తాను ఇప్పటికే ఆలస్యమయింది" అన్నది. నేను వాకిటివరకు వెళ్ళిచూచేను. సందుగనక జనం సాధారణంగా వుండరు. ఎవ్వరూ లేరని తేల్చుకున్న తర్వాత "వెళ్ళండి" అన్నాను.

నే నక్కడ వున్నన్ని రోజులూ, రోజూ కాకపోయినా అవకాశం వున్నపుడల్లా వచ్చేది. అయితే మేం అమలిన శృంగారం దాటి ముందుకు పోలేదు. దీంట్లో ఆమె ఆనందం అనుభవించిందో, బాధ అనుభవించిందో నేనెప్పుడూ వూహించలేదు,

పరీక్షలు రేపు అయిపోతాయనంగా - అనుకుంటాను. ఆమెలో గొప్ప మార్పు చూచేను.

ఆ రోజు సాయంత్రం రూము కొచ్చింది.

"ఎప్పుడు వెళ్తారు వూరు" అంది.

"రేపు సాయంత్రం" అన్నాను.

"ఈ ప్రాంతాలకి మళ్ళీ రారనుకుంటాను" అంది.

నేనేం సమాధానం చెప్పలేదు.

"ఇన్నాళ్లూ ఈ ట్రైనింగు మూలంగా బయట గాలి పీల్చేను. ఇక జీవితాంతం నాలుగు గోడలమధ్య వుండాలి. తలుచుకుంటే కంపరం పుడుతోంది"

ఆమె గొంతులో గాద్గదికం స్పష్టంగా కనిపిస్తోంది.

"చిత్రంగా మాట్లాడుతున్నారు ఇన్నేళ్ళూ ఈ జీవితానికి అలవాటు పడ్డారు. ఇప్పుడు భయం కలుగుతోందా" అన్నాను.

ఆమె సమాధానం చెప్పలేదు, చాలా సేపు నిశ్శబ్దంగా కూర్చుంది. ఆ తర్వాత వున్నట్టుండి కింద పడిపోయింది. ఫిట్సు వచ్చాయి. ఒక్క నిముషం అప్రతిభుణ్ని అయిపోయాను. తర్వాత ముఖంమీద నీళ్ల చిందించి విసిరేను అర్థగంట తర్వాత లేచికూచుంది. ఫ్లాస్కులోవున్న కాఫీ తీసియిచ్చాను. కాఫీ తాగుతూ "చాలా ఆలస్యమయినట్టుంది. అవునా?

అంది. "ఫర్వాలేదు కాసేపు రెష్టుతీసుకొని వెళ్ళండి, ఫిట్సు మామూలుగా వస్తాయా ?" అన్నాను.

"లేదు ఇదే మొదలు" అంది. పది నిముషాలు విశ్రాంతి తీసుకుంది. "ఇక వెళ్తానండీ, రేపు నేను కనిపించలేను, జ్ఞాపకం వుంటానా మీకు" అంది.

నేను ఆమెను గుండెలకు అదుముకున్నాను. ఆమె నన్ను గట్టిగా కౌగలించుకొని ఏడుస్తోంది, ఆమెని ఏమని ఓదార్చను ? ఏడుస్తూనే బయటికి వెళ్ళింది.

"వాకిట్లో నిలబడి ఆమె కనిపించే వరకూ చూచేను"

* * *

విశ్వం ఈ కథచెప్పి వెళ్ళిపోయాడు. విశ్వం కథ ఎక్కడ ఆపాడో సరిగా అక్కడే క్లైమాక్స్ మొదలవుతుంది. దాన్ని విశ్వం చెప్పలేదు. అందుకే నాకు విశ్వం చెప్పిన కథ క్లైమాక్స్ లేని కథగా కనిపించింది.